సాక్షి
నిజామాబాద్
బుధవారం ¦ 30 ¦ జూలై ¦ 2025

ఘనంగా నాగుల పంచమి

నాగుల పంచమిని జిల్లాలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పుట్టలు, ఆలయాల వద్దకు వెళ్లి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాకేంద్రంలోని బోయిగల్లీ నాగేంద్రుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పోచమ్మగల్లి, తిలక్‌గార్డెన్ ప్రాంతాల్లోని పాముల పుట్టలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లలో తమ సోదరుల కళ్లను ఆవుపాలతో కడిగి ఆశీర్వదించారు.

నగరంలోని తిలక్‌గార్డెన్‌లో పుట్టలో పాలుపోస్తున్న మహిళలు



సమష్టి కృషితో జిల్లా అభివృద్ధి

- కూరగాయల సాగు దిశగా ఎస్‌హెచ్‌జీలను ప్రోత్సహిస్తాం
- పైలట్ ప్రాజెక్టుగా జిల్లా.. ఆ తరువాత రాష్ట్రమంతా అమలు చేస్తాం
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సీజనల్ వ్యాధుల నియంత్రణ, వనమహోత్సవంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమీక్ష
- భారీ వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం

ఉమ్మడి జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించేలా అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. క్షేత్రస్థాయికి వెళ్తేనే సమస్యలు తెలుస్తాయని, అప్పుడే పరిష్కారానికి వీలుంటుందని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సీజనల్ వ్యాధుల నియంత్రణ, వనమహోత్సవం, రేషన్‌కార్డులు, సన్నబియ్యం పంపిణీ తదితర అంశాలపై సమీక్షించిన మంత్రి.. భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క, పక్కన ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్, పోచారం, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్, భూపతిరెడ్డి, రాకేశ్‌రెడ్డి, కలెక్టర్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) మహిళలను కూరగాయల సాగు దిశగా ప్రోత్సహించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా తోడ్పాటునందించే అంశాన్ని పరిశీలిస్తామని జిల్లా ఇన్‌చార్జి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి మంత్రి సీతక్క అన్నారు. నిజామాబాద్ జిల్లాలో ప్రయోగాత్మకంగా(పైలట్ ప్రాజెక్టు) అమలు చేసి, ఆ తరువాత రాష్ట్రమంతటా అమలు చేస్తామని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో, సమష్టి కృషితో ముందుకెళ్తూ అభివృద్ధిలో జిల్లాను అగ్రస్థానంలో నిలుపాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సీజనల్ వ్యాధుల నియంత్రణ, వన మహోత్సవం, భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఎరువులు, మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక పరిపుష్టికి చేపడుతున్న కార్యక్రమాలు, గృహజ్యోతి, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ శాఖల పనితీరుతోపాటు తాగునీటి సరఫరా, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై మంత్రి సమీక్షించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షాసమావేశంలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేశ్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, అప్పుడే సమస్యలు తెలిసి వాటి పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు. నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని, ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా చొరవ చూపుతామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వడ్డీ లేని రుణాలు, ప్రమాద బీమా, లోన్ బీమా తదితర ప్రయోజనాల గురించి విస్తృత ప్రచారం నిర్వహించి, మహిళలందరూ స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరేలా ప్రోత్సహించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా అన్ని రంగాలలో సమగ్ర అభివృద్ధి సాధించేలా అందరి సహకారంతో ముందుకు వెళ్తామన్నారు.

జిల్లాలో ఎరువుల కొరత తలెత్తకుండా జిల్లా యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తుండడం అభినందనీయమని మంత్రి ప్రశంసించారు. వర్షాకాలంలో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వచ్చే రెండు నెలలపాటు అప్రమత్తంగా వ్యవహరించాలని, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పాముకాటు మందుతోపాటు అన్ని రకాల ఔషధాలను అందుబాటులో ఉంచాలని అన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సీఎంఆర్ డిఫాల్టర్లపై..

కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వకుండా అవకతవకలకు పాల్పడిన రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్టు అమలు చేయాలని సీతక్క ఆదేశించారు. డిఫాల్టర్లపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలకు సంబంధించి సమగ్ర వివరాలతో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పలు అంశాలను ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ట్రెయినీ కలెక్టర్ కరోలినా చింగ్తియాన్ మావీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర రైతు, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతోపాటు అధికారులు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. టీఎన్జీవో, టీజీవో, ఇతర సంఘాల ప్రతినిధులు మంత్రికి వినతిపత్రాలు అందజేశారు.

అన్ని చర్యలు తీసుకుంటున్నాం

ఆయా విభాగాల వారీగా వివరాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంత్రి సీతక్క దృష్టికి తెచ్చారు. భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు అప్రమత్తతతో అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. కలెక్టరేట్‌తోపాటు ఆయా శాఖల కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ప్రగతి సాధించామని, రేషన్ కార్డుల పంపిణీ, సన్న బియ్యం పంపిణీ సజావుగా సాగుతోందని తెలిపారు.

ప్రభుత్వానికి ఎమ్మెల్యే ధన్‌పాల్ డెడ్‌లైన్

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు లబ్ధిదారులకు అప్పగించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గతేడాది నిర్వహించిన సమీక్షాసమావేశంలో హౌసింగ్ మంత్రి మాట్లాడుతూ.. దసరా నాటికి ఇళ్లు పంపిణీ చేస్తామని చెప్పారని, ఇప్పటికీ అతీగతీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల్లో పేదలకు ఇళ్లు అప్పగించకపోతే వారి తరఫున ఉద్యమిస్తానని, అప్పటికీ ప్రభుత్వం స్పందించని పక్షంలో నిరాహార దీక్ష చేస్తానని స్పష్టం చేశారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్యులు లేరని, జీజీహెచ్‌లో మౌలిక వసతులు లేవని సమస్యలను లేవనెత్తారు. మదర్–చైల్డ్ విభాగం ప్రారంభానికి నోచుకోవడం లేదన్నారు. నియోజకవర్గానికి రూ.100 కోట్ల ప్రత్యేక నిధులు, ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు

ఓల్టేజీ సమస్య తలెత్తకుండా..

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓల్టేజీ సమస్య తలెత్తకుండా చూడాలని విద్యుత్ అధికారులకు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పారిశుద్ధ్య కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఎప్పుడో 20 ఏళ్ల కిందట గృహజ్యోతి పథకం వచ్చిందంటూ అధికారులు కొర్రీలు పెట్టడం సరికాదన్నారు. సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ.. అంకాపూర్‌లో ఉన్నట్లుగా పెర్కిట్–మోర్తాడ్ మధ్యలో, బాల్కొండ–పోచంపాడ్ మధ్యలో జాతీయ రహదారిపై ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మించాలన్నారు. రామడుగు చివరి ఆయకట్టు అయిన వేల్పూర్ మండలంలోని పచ్చల నడ్కుడ, వాడి, కొత్తపల్లి, అట్లూర్, భీంగల్ మండలంలోని చేంగల్, బడాభీంగల్ గ్రామాలకు సాగునీరు అందడంలేదని.. నవాబ్ ఎత్తిపోతల పథకం నుంచి పచ్చలనడ్కుడ చెరువుకు నీటిని తరలిస్తే ఆరు గ్రామాలకు సాగునీటి సమస్య తప్పుతుందన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రిని కోరారు.

చురుగ్గా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- ప్రజాప్రతినిధులందరినీ కలుపుకుని ముందుకు..
- పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తాం
- మీడియాతో మంత్రి సీతక్క



నిజామాబాద్‌అర్బన్: అభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులను కలుపుకొని సమన్వయంతో పనిచేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశంలో అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి పరిష్కరిస్తామన్నారు. విద్య, వైద్యం, ఇరిగేషన్‌లో సమస్యల పరిష్కారానికి సమన్వయంగా ముందుకు వెళ్తామన్నారు. జిల్లాలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చురుగ్గా సాగుతోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం బ్యాంకు లింకేజీ ద్వారా రూ.20 కోట్లు అందించడం జరుగుతుందన్నారు. మహిళా సంఘాల ద్వారా కూరగాయల సాగును ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. వానాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ప్రమాదం జరిగితే తక్షణమే స్పందించాలన్నారు. జిల్లాలో యూరియా కొరత లేకుండా చూశారని అధికారులను మంత్రి అభినందించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు పరిష్కారం చూపుతామన్నారు. ఉమ్మడి జిల్లాలో సమస్యల పరిష్కారంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు బీసీ రిజర్వేషన్లపై నిరసన తెలుపడం సరికాదన్నారు. సమావేశంలో మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి పోటెత్తిన వరద..

- లక్షా 5 వేల క్యూసెక్కుల వరద నీరు
- వేగంగా పెరుగుతున్న నీటి మట్టం
- నీటి నిల్వ 36.9 టీఎంసీలు!

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి మహారాష్ట్ర ప్రాంతం నుంచి వరద పోటెత్తింది. సోమవారం రాత్రి వరకు 65 వేల క్యూసెక్కులు వచ్చిన వరద నీరు రాత్రికి 75 వేల 500 క్యూసెక్కులకు పెరిగింది. నిలకడగా అర్ధరాత్రి వరకు కొనసాగి మళ్లీ వరద నీరు పెరిగి 89 వేల క్యూసెక్కులకు చేరింది. మంగళవారం ఉదయం 9 గంటలకు వరద నీరు పెరిగి లక్ష 5 వేల క్యూసెక్కులకు పెరిగింది. ఈ సంవత్సరం లక్ష క్యూసెక్కుల వరద నీరు దాటడం ఇదే తొలిసారి. మధ్యాహ్నం 12 గంటలకు మళ్లీ తగ్గుముఖం పట్టి 86 వేల 620 క్యూసెక్కులకు పడిపోయింది. తరువాత మరింత తగ్గి 67, 401 క్యూసెక్కులకు పడిపోయింది.

సాయంత్రం 6 గంటలకు 64 వేల 345 క్యూసెక్కులకు తగ్గిపోయింది. రాత్రి వరకు అంతే స్థాయిలో వరద ప్రాజెక్ట్‌లోకి కొనసాగింది. ప్రాజెక్ట్‌లోకి లక్ష క్యూసెక్కులకు పైగా వరద నీరు రావడంతో ప్రాజెక్ట్ నీటి మట్టం వేగంగా పెరుగుతోంది.



ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం రాత్రికి ప్రాజెక్ట్‌లో 1076.80 (36.9 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

గతేడాది నీటి మట్టాన్ని దాటి..

ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం గతేడాది ఇదే రోజున ఉన్న నీటి మట్టాన్ని దాటింది. గతేడాది ఇదే రోజున ప్రాజెక్ట్‌లో 1075.20 (33.37 టీఎంసీలు) నిల్వ ఉంది. ఆ నీటి నిల్వను మధ్యాహ్నానికే దాటి నీటి మట్టం పెరుగుతోంది. ప్రాజెక్ట్‌నీటి మట్టం వేగంగా పెరగడంపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గాదేపల్లిలో 'ఎకో టూరిజం' డౌటే!

- స్థల సేకరణకు ఎదురవుతున్న అడ్డంకులు
- అనువుగా లేని ఇదివరకు ఎంపిక చేసిన స్థలం
- గ్రామస్తులు సహకరిస్తేనే మరొకచోట స్థలం దొరికే అవకాశం
- లేదంటే ఎకో టూరిజంపై ఆశలు వదులుకోవాల్సిందేనా..?



డొంకేశ్వర్(ఆర్మూర్): ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో గాదేపల్లి వద్ద ఎకో టూరిజం ఏర్పాటుపై అనుమానాలు కలుగుతున్నాయి. స్థల సేకరణ విషయంలో అటవీ అధికారులకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఓవైపు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా... గాదేపల్లిలో వాచ్ టవర్ల ఏర్పాటు కోసం ఇంత వరకు అనువైన స్థలమే దొరకడంలేదు. అయితే ఇది వరకు సర్వే చేసిన ఒక స్థలం శ్మశాన వాటిక పక్కనే ఉందనే కారణంతో అధికారులు దానిని తిరస్కరించారు. దీంతో స్థల సేకరణ సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. మరో చోట స్థలం లేకపోవడంతో అధికారులు గ్రామస్తుల సహకారాన్ని కోరుతున్నారు. దీని కోసం త్వరలోనే అధికారులు మరోసారి బ్యాక్‌వాటర్ ప్రాంతానికి రానున్నట్లు తెలిసింది. ఒక వేళ గ్రామస్తులు ముందుకు రాని పక్షంలో గాదేపల్లి వద్ద ఎకో టూరిజం ఏర్పాటుపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పకనే చెప్తున్నారు.

సమన్వయం లేక.. సహకారం లభించక...

జిల్లాలో ఎకో టూరిజం ఏర్పాటుకు బీజం పోసిందే డొంకేశ్వర్ మండలంలోని గాదేపల్లి వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతం. కృష్ణ జింకలు, విదేశీ పక్షులు, పచ్చిక బయళ్లతో ఇక్కడ కనువిందుగా ఉంటుంది. అందుకే గాదేపల్లి వద్ద అత్యధికంగా 18 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. నందిపేట్ మండలం ఉమ్మెడ వద్ద 1.20 ఎకరాలు, బాల్కొండ మండలం జలాల్‌పూర్ వద్ద మూడెకరాలకు స్థల సేకరణ ఎప్పుడో పూర్తయింది. ఇప్పుడు సమస్య వచ్చిందల్లా గాదేపల్లి వద్దనే. అటవీ అధికారులకు ఎస్సారెస్పీ ఇరిగేషన్ అధికారుల సహకారం లభించడం లేదనే వాదన వినిపిస్తోంది. ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోని భూములను సైతం ప్రభుత్వం కేటాయించిన 18 ఎకరాల స్థలంలో చూపెట్టారు. తద్వారా వాచ్ టవర్లు, రిసార్టులు, పార్కింగ్ ఏరియా, ఇతర వసతులు కల్పించడానికి స్థలం లేకుండా పోయింది. కాగా శ్మశాన వాటిక పక్కనే ఎకరం స్థలాన్ని గుర్తించిన అధికారులు ఇది ఇబ్బందికరంగా ఉంటుందని వెనక్కి తగ్గారు. మరే దగ్గర స్థలం లేకపోవడంతో అటవీ అధికారులు ముందడుగు వేయలేకపోతున్నారు. ముంపునకు గురై ప్రభుత్వం నుంచి పరిహారం పొందిన వారికి నచ్చజెప్పి భూములను తీసుకోవాలనే ఆలోచన ఉన్నప్పటికీ సమస్యగా మారుతుందేమోనని ఎస్సారెస్పీ ఇరిగేషన్, అటవీ శాఖల అధికారులు వెనకడుగు వేస్తున్నారు. ఇటు గ్రామస్తులు కూడా సెంటు భూమిచ్చినా కూడా తమ భూములు ఎక్కడ పోతాయోననే భయంతో ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు చొరవ తీసుకుంటే తప్పా గాదేపల్లి వద్ద స్థల సేకరణకు పరిష్కారం దొరికే పరిస్థితైతే కనిపించడం లేదు. త్వరలోనే గ్రామస్తులతో సమావేశమై వాచ్ టవర్ల కోసం అనువైన మరొక స్థలాన్ని సేకరించడానికి పయత్నాలు చేస్తామని అటవీ శాఖకు చెందిన అధికారులు 'సాక్షి'కి వెల్లడించారు.



గతేడాది ఫిబ్రవరిలో గాదేపల్లి శివారులో స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

న్యూస్‌రీల్

వాగులను దాటే ప్రయత్నం చేయొద్దు



సిరికొండ: వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో దాటే ప్రయత్నం చేయొద్దని పోలీస్ కమీషనర్ సాయిచైతన్య సూచించారు. వర్షాల నేపథ్యంలో తూంపల్లి వద్ద కప్పలవాగును, కొండూర్ వద్ద గల లో లెవల్ వంతెనను, సిరికొండ సమీపంలోని దొండ్ల వాగును సీపీ మంగళవారం పరిశీలించారు. ఆయా చోట్ల స్థానికులతో మాట్లాడి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామ భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల ప్రాముఖ్యతను తెలిపి, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీపీ వెంట ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై రామకృష్ణ ఉన్నారు.

రేపు స్పాట్ కౌన్సెలింగ్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): బాసర జోన్ పరిధిలోని నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల, బాలుర కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం గ్రూపుల్లో సీట్ల భర్తీకి గురువారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జోనల్ అధికారి పూర్ణచందర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జోన్ పరిధిలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర, బాలికల కళాశాలల్లో 31న ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని, తాము చేరాలనుకుంటున్న కళాశాలలో అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన సూచించారు. అడ్మిషన్లు రిజర్వేషన్, పదో తరగతి మార్కుల ప్రాతిపాదికన కౌన్సెలింగ్ నిర్వహిస్తారని తెలిపారు.

జాతీయస్థాయి హాకీకి ఎంపిక



సిరికొండ: జాతీయ స్థాయి హాకీ పోటీలకు తూంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు తోయేటి లోకేశ్, పుల్లింటి విశాల్ ఎంపికై నట్లు జెడ్పీహెచ్‌ఎస్ పీడీ నాగేశ్ మంగళవారం తెలిపారు. గత నెలలో ఆదిలాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు తమ పాఠశాల పూర్వ విద్యార్థులు కావడంతో ఎంఈవో రాములు, ఇన్‌చార్జి హెచ్‌ఎం మనోహర్, వీడీసీ సభ్యులు, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగారెడ్డి, రమణ హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన క్రీడాకారులు చెన్నైలో వచ్చే నెల 8వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని పీడీ తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు



నిజామాబాద్ రూరల్: నగరంలోని జెండా బాలాజీ ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. రెండు నెలల కాలానికి రూ.96,371 ఆదాయం సమకూరినట్లు ఆలయ చైర్మన్ లవంగ ప్రమోద్ తెలిపారు. చైర్మన్, ధర్మకర్తలు, కార్యనిర్వాహణ అధికారి వేణు నేతృత్వంలో భక్తులు ఆదాయాన్ని లెక్కించగా, ఆలయ పరిశీలకులు కమల, దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయలో 9,11 తరగతుల్లో ప్రవేశాలు

నిజామాబాద్‌అర్బన్: నవోదయ విద్యాలయంలో 2026– 27 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సెప్టెంబర్ 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, 2026 ఫిబ్రవరి 7వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా జవహర్ నవోదయ విద్యాలయంలో ఖాళీలకు సంబంధించి సీట్లను భర్తీ చేస్తామని, ప్రతిభ ఆధారంగా అభ్యర్థులు ఎంపిక ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

మంత్రి సీతక్కను కలిసిన సీపీ



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ కలెక్టర్‌ ఆఫీస్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్‌, రూరల్‌ డెవలప్‌మెంట్‌, రూరల్‌ వాటర్‌ సప్లయ్‌, ఉమెన్‌ అండ్‌ చైల్డ్‌ వెల్ఫేర్‌ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)ను సీపీ సాయిచైతన్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన మంత్రికి పూల మొక్కను అందజేశారు.

ఇంజినీరింగ్‌ కళాశాల మంజూరు చేయండి



తెయూ(డిచ్‌పల్లి): ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాకు ఇంజినీరింగ్‌ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ యూనివర్సిటీ డాక్టరేట్స్‌ అసోసియేషన్‌ సభ్యులు కోరారు. ఈమేరకు వారు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీలకు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్‌ అధ్యక్షుడు సంతోష్‌గౌడ్‌, సభ్యులు పిట్ల సరిత, వంగ రాహుల్‌, రమాదేవి, దిలీప్‌ కుమార్‌ తదితరులు ఉన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తాం

నిజామాబాద్‌అర్బన్‌: నగర జర్నలిస్టులకు అందుబాటులో ఉన్న రెండు ప్రభుత్వ స్థలాలను ఇళ్ల కోసం కేటాయించేలా చూస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ అన్నారు. ఈ మేరకు కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డికి వారు ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని గంగస్థాన్‌లో ఉన్న ప్రభుత్వ భూమి రూరల్‌ నియోజకవర్గంలో ఉన్నందున ఎమ్మెల్యే భూపతి రెడ్డితో మాట్లాడి జర్నలిస్టులకు కేటాయిస్తామని అన్నారు. అలాగే ఉర్దూ జర్నలిస్టుల కోసం అర్సపల్లి శివారులోని నిజాంసాగర్‌ సబ్‌ కెనాల్‌ భూమిని కేటాయించాలని కలెక్టర్‌ను వారు ఆదేశించారు. ఇన్‌చార్జి మంత్రిని కలిసిన వారిలో జర్నలిస్టు నాయకులు జమాల్పూర్‌ గణేశ్‌, పాకాల నర్సింలు, పంచరెడ్డి శ్రీకాంత్‌, వాగ్మరే సుభాష్‌, ప్రమోద్‌ గౌడ్‌ తదితరులు ఉన్నారు.

ఆదివాసీలను నాయకులుగా తీర్చిదిద్దుతాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క. పాల్గొన్న షబ్బీర్‌ అలీ, మధుయాష్కిగౌడ్‌ తదితరులు

- గిరిజనుల హక్కులను కేంద్రం హరిస్తోంది
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- నగరంలో ఆదివాసీ గిరిజన కాంగ్రెస్‌ ఉమ్మడి జిల్లా శిక్షణా తరగతులు

నిజామాబాద్‌ సిటీ: దేశవ్యాప్తంగా 25 వేల మంది ఆదివాసీలను నాయకులుగా తీర్చిదిద్దుతామని, అందులో భాగంగానే శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని హోటల్‌ హరితలో మంగళవారం నిజామాబాద్‌ జిల్లా కాంగ్రెస్‌ పార్టీ ఆదివాసీ గిరిజన చైర్మన్‌ కెతావత్‌యాదగిరి అధ్యక్షతన ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా ఆదివాసీ గిరిజన శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏఐసీసీ అగ్రనాయకుడు రాహుల్‌ గాంధీ సూచనలతో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్‌ బొమ్మమహేష్‌కుమార్‌ గౌడ్‌ల ఆదేశాలతో తెలంగాణలో ఎస్టీలకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రం చర్యలతో ఆదివాసీల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో రాజ్యాంగ ఉల్లంఘనలు జరుగుతున్నాయని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్‌ బాధ్యత తీసుకుంటుందన్నారు.

ప్రభుత్వ సలహాదారు మహ్మద్‌ అలీ షబ్బీర్‌ మాట్లాడుతూ.. జల్‌–జమీన్‌–జంగిల్‌ (నీరు, అటవీ, భూ వనరులు)పై గిరిజన హక్కుల కోసం కాంగ్రెస్‌ కట్టుబడి ఉందన్నారు. గిరిజనుల అటవీ భూములు, ఇతర వనరులు హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్‌ ఎల్లపుడూ పోరాడుతూనే ఉందన్నారు.

మాజీ ఎంపీ మదుయాష్కీగౌడ్‌ మాట్లాడుతూ.. ఈ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన వారు ఆదివాసి, గిరిజనులను సరైన మార్గంలో నడిపించి రాహుల్‌ గాంధీని ప్రధానిని చేయాలన్నారు.

కాంగ్రెస్‌పార్టీ ఎస్టీ సెల్‌ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్‌ మాట్లాడుతూ.. పీసీసీ చీఫ్‌ బొమ్మ మహేష్‌ కుమార్‌ గౌడ్‌ సూచనలతో ఇప్పటివరకు 6 జిల్లాల్లో శిక్షణా తరగతులు పూర్తిచేయగా ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా 7వది అని తెలిపారు. జాతీయ కన్వీనర్‌ రాహుల్‌బాల్‌, ట్రైకార్‌ రాష్ట్ర చైర్మన్‌ తేజావత్‌ బెల్లయ్య నాయక్‌, ఎస్టీసెల్‌ జిల్లా చైర్మన్‌ కెతావత్‌ యాదగిరి రాథోడ్‌, ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌ బిన్‌హందాన్‌, టీఎస్‌సీడ్స్‌ చైర్మన్‌ అవినాష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్‌ గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రాజారెడ్డి, పీసీసీ డెలిగేట్‌ బాడ్సి శేఖర్‌గౌడ్‌, కామారెడ్డి జిల్లా చైర్మన్‌ రాణా ప్రతాప్‌ రాథోడ్‌, నాయకులు కోటియా నాయక్‌, మల్లేశ్వరి, చంద్రకళ, గణేష్‌ నాయక్‌, వినోద్‌ నాయక్‌, నరేష్‌ నాయక్‌, సునీల్‌ జాదవ్‌, మల్లికార్జున్‌, కెతావత్‌ ప్రకాష్‌ నాయక్‌, హరినాయక్‌ పాల్గొన్నారు.

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పలకుప్పగా మార్చింది



తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్‌ ప్రభుత్వం అన్ని రంగాల్లో భ్రష్టుపట్టించిందని, అప్పుల కుప్పగా మార్చిందని బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. కమీషన్ల కోసమే ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పేరు మార్చి, డిజైన్‌ మార్చి కోట్ల రూపాయలు కాజేశారన్నారు. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్‌ సాగుచేయాలని సూచించారు. ఆయిల్‌పామ్‌తో దీర్ఘకాలంలో లాభాలు ఎక్కువగా వస్తాయని రైతులు ఆ వైపు దృష్టి సారించాలన్నారు.

కాంగ్రెస్‌ గెలుపులో గిరిజనుల పాత్ర అధికం



కాంగ్రెస్‌ పార్టీ గెలుపులో గిరిజనుల పాత్ర చాలా ఉందని, రూరల్‌ నియోజకవర్గంలో తండాలు, గిరిజనులు ఎక్కువగా ఉన్నారని రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లతో సంబంధం లేకుండా గిరిజనులు సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా గెలిచేలా ఇప్పటినుంచే కృషిచేయాలన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్‌



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా నాయకులు

నాణ్యమైన ఆహారం అందించాలి

నిజామాబాద్‌నాగారం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించాలని ట్రెయినీ కలెక్టర్‌ కరోలిన్‌ చింగ్తియాన్‌ మావీ అన్నారు. నగరంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించారు. దుబ్బ, వినాయక్‌నగర్‌ ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఏవిధమైన పౌష్టికాహారం అందిస్తున్నారో తనిఖీ చేశారు. అర్బన్‌ సీడీపీవో సౌందర్య, సూపర్‌వైజర్లు, టీచర్లు, ఆయాలు ఉన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులతో ట్రెయినీ కలెక్టర్‌



విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి
- మాక్లూర్‌లో ఆకస్మిక పర్యటన

మాక్లూర్‌: అధికారులు విధులు నిర్వహించటంలో నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, సొసైటీలతో పలు ప్రభుత్వ కార్యాలయాలను మంగళవారం కలెక్టర్‌ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యా కేంద్రానికి వచ్చే ప్రజల పట్ల ప్రేమానురాగాలతో ఉండి తగిన వైద్యం అందించాలని మాక్లూర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులకు సూచించారు. సొసైటీలో ఎరువుల స్టాక్‌ వివరాలతో కూడిన పట్టికను గుమ్మం ఎదుట ఉంచటంపై కలెక్టర్‌ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు పొదుపు సంఘాల్లో దగ్గరుండి రుణాలు ఇప్పించాలని పంచాయతీ కార్యదర్శి రాకేష్‌ను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందితో మాట్లాడి, పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంథాలయం తాళం వేసి ఉండటంతో శాఖ గ్రంథపాలకుడుపై కలెక్టర్‌ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 8 గంటలకే తీయాల్సిన గ్రంథాలయం 11 అవుతున్న ఎందుకు తీయలేదని సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డిని ఫోన్‌ ద్వారా ఆరాతీశారు. అనంతరం ఎంఈవో కార్యాలయంలో ఇతర సిబ్బంది లేకపోవటాన్ని గమనించి కలెక్టర్‌ మండిపడ్డారు. ఇక ముందు ఇలా ఉంటే సహించేది ఉండదని హెచ్చరించారు.



మాక్లూర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి

వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు 'రుద్రూర్‌' అనువైనది

- రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌ రెడ్డి
- రుద్రూర్‌ వ్యవసాయ పరిశోధన కేంద్రం పరిశీలన

రుద్రూర్‌: ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాకు మంజూరైన వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు రుద్రూర్‌ వ్యవసాయ పరిశోధన కేంద్ర అనువైన ప్రాంతమని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని రుద్రూర్‌ వ్యవసాయ పరిశోధన కేంద్రం భవనాలు, క్వార్టర్లు, ఆడిటోరియం, వసతి భవనాలను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం పోచారం మాట్లాడుతూ.. వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు అనువైన ప్రాంతం కోసం ప్రత్యేక బృందం స్థల పరిశీలన చేస్తున్నదన్నారు. రుద్రూర్‌ పరిశోధన కేంద్రం పరిధిలో మూడు వందల ఎకరాల స్థలం, మౌలిక వసతులు, భవనాలు, ప్రయోగ శాలలు, ఆడిటోరియం, వసతి గృహలు ఉన్నాయన్నారు. ఇక్కడే వ్యవసాయ పాలిటెక్నిక్‌, ఫుడ్‌ సైన్స్‌ టెక్నాలజీ కళాశాలలు కొనసాగుతున్నాయని, శాస్త్రవేత్తలు నిరంతరం నూతన వరి, చెరుకు వంగడాల రూప కల్పనలో నిమగ్నమవుతున్నారన్నారు. ఈ అంశాలు వందశాతం వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు దోహదపడుతాయన్నారు. ఈ అంశాలను సీఎం, మంత్రులకు వివరిస్తానన్నారు.

పరిశోధన కేంద్రం ఇన్‌చార్జి హెడ్‌ పరమేశ్వరి, ఫుడ్‌సైన్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ వెంకట్‌ రెడ్డి, తహసీల్దార్‌ తారాబాయి, ఎంపీడీవో భీమ్‌రావ్‌, మాజీ ఎంపీటీసీ నరోజి గంగారాం, విండో చైర్మన్‌ సంజీవ రెడ్డి, మాజీ చైర్మన్‌ పత్తి రాము, నాయకులు తోట అరుణ్‌కుమార్‌, రామగౌడ్‌, పార్వతి ప్రవీణ్‌ తదితరులు ఉన్నారు.



రుద్రూర్‌ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆవరణలో పర్యటిస్తున్న పోచారం శ్రీనివాస్‌ రెడ్డి

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

ఖలీల్‌వాడి: డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు సంభవించవని నిజామాబాద్‌ ఆర్టీసీ ఆర్‌ఎం జ్యోత్స్న అన్నారు. నిజామాబాద్‌ రీజినల్‌ మేనేజర్‌ కార్యాలయంలో మంగళవారం ఎలక్ట్రికల్‌ బస్సు డ్రైవర్ల ట్రెనింగ్‌ ప్రోగ్రామ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. వాహనం నడపడానికి ముందు ప్రాథమిక తనిఖీలు చేయాలన్నారు. సాంకేతిక సమస్యలు గుర్తించిన వెంటనే గ్యారేజీకి నివేదించాలన్నారు. ప్రయాణికులతో శాంతంగా, మర్యాదగా మాట్లాడాలని, పెద్దవారికి, మహిళలకు, చిన్నపిల్లలకు సహాయంగా ఉండాలన్నారు. డ్రైవర్లు సమయపాలన పాటించాలని, ఉద్యోగం పట్ల నిజాయితీగా ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనం వినియోగించకూడదన్నారు. ఆర్టీసీ గౌరవం కాపాడే బాధ్యత డ్రైవర్లు, సిబ్బంది పై ఉందన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఎం జ్యోత్స్న

నూతన ఆవిష్కరణలతో సమాజానికి మేలు

నిజామాబాద్‌అర్బన్‌: ఎప్పటికప్పుడు కొత్తగా వచ్చే ఆవిష్కరణలు సమాజానికి మేలు చేస్తాయని గిరిరాజ్‌ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌ రాంమోహన్‌రెడ్డి అన్నారు. కళాశాలలో మంగళవారం తెలంగాణ ఆవిష్కరణల విభాగం ఆధ్వర్యంలో 'నూతన ఆవిష్కర్తల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ.. చదువుతో సంబంధం లేకుండ కూడా కొత్తకొత్త ఆలోచనలతో ఎన్నో ఆవిష్కరణలు వస్తున్నాయన్నారు. వారిని ప్రోత్సహించాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఔత్సాహిక విద్యార్థులు వివిధ రకాల ఆవిష్కరణల గురించి ప్రస్తావించారు. రమేష్‌, అనూష, ముత్తెన్న, చంద్రశేఖర్‌, పూర్ణ చందర్‌ రావు, రామస్వామి, రమేశ్‌ గౌడ్‌ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం తెయూలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పృథ్వీరాజ్‌, ప్రధాన కార్యదర్శిగా సమీర్‌ ఎన్నికయ్యారు. కమిటీ ఉపాధ్యక్షులుగా అక్షయ్‌, అశోక్‌, అజయ్‌, మనోజ్‌, జ్యోతి, జాయింట్‌ సెక్రెటరీలుగా నవీన్‌, లెనిన్‌, అఖిల్‌, రాకేష్‌, నరేందర్‌, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, రాష్ట్ర ఆల్‌ యూనివర్సిటీస్‌ కన్వీనర్‌ జీవన్‌ మాట్లాడుతూ.. 60 లక్షల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏబీవీపీ ఉందన్నారు. అనంతరం ఈ నెల 8న ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. సభ్యులు శివ, విభాగ్‌ సంఘటన మంత్రి హర్ష, రాష్ట్ర కార్య సమితి సభ్యులు అమృత్‌చారి, స్టేట్‌ ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌ మోహన్‌, నాయకులు సాయికుమార్‌, నవీన్‌, నాగరాజు, ప్రమోద్‌ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌ పోటీలో కంజర విద్యార్థి ప్రతిభ

నిజామాబాద్‌ రూరల్‌: జిల్లా కేంద్రంలోని నాగారం రాజారాం స్టేడియంలో అండర్‌–12 జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మోపాల్‌ మండలానికి చెందిన కంజర పాఠశాల విద్యార్థి కుందన్‌ సిద్ధాంత్‌ జావెలిన్‌త్రోలో రెండో స్థానంలో నిలిచినట్లు పాఠశాల హెచ్‌ఎం తెలిపారు. అనంతరం విద్యార్థిని ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.



క్రైం కార్నర్‌

అమెజాన్‌ డెలివరీ హబ్‌ పేరిట సైబర్‌ మోసం

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తిని అమెజాన్‌ డెలివరీ హబ్‌ పేరిట సైబర్‌ మోసగాళ్లు బురిడి కొట్టించి, రూ.లక్ష71వేలను కాజేశారు. బాల్కొండ ఎస్సై శైలెందర్‌ తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన మాలెం సత్యసాగర్‌కు గత నెల 27న అమెజాన్‌ డెలివరీ హబ్‌ నుంచి మాట్లాడుతున్నట్లు సైబర్‌ మోసగాళ్లు ఫోన్‌ చేశారు. బాల్కొండలో అమెజాన్‌ హబ్‌ ఏర్పాటు చేయాలనుకుంటున్నామని అందుకు మీ పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. అందుకు ముందుగా రూ.17,700 చెల్లించాలని సూచించాడు. దీంతో అదే రోజు బాధితుడు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించాడు. మళ్లీ ఈ నెల 15న ఫోన్‌ చేసి ఒప్పందం కోసం రూ. 28వేల 972 పంపించాలని వారు తెలుపగా, వెంటనే పంపించాడు. మెటీరియల్‌ కోసం డబ్బులు పంపమంటే ఇటీవల రూ.లక్ష 24వేలు ఫోన్‌పే ద్వారా పంపించాడు. కొన్ని రోజుల నుంచి వరుస ఫోన్‌ కాల్స్‌ రావడంతోపాటు వారు మాట్లాడుతున్న విధానాన్ని గమనించి సైబర్‌ మోసానికి గురైనట్లు గ్రహించాడు. వెంటనే సైబర్‌క్రైం హెల్ప్‌లైన్‌ 1930కి కాల్‌ చేసి ఫిర్యాదు చేశాడు. అనంతరం బాల్కొండ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌ కేసులో ఒకరికి జైలుశిక్ష

నవీపేట: నవీపేట శివారులో ఇటీవల పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. సదరు వ్యక్తి మహారాష్ట్రలోని ఉమ్రికి చెందిన నాగనాథ్‌ గంగారామ్‌గా గుర్తించి, కేసు నమోదు చేశారు. అనంతరం మంగళవారం పోలీసులు అతడిని కోర్టులో హాజరు పర్చగా, జడ్జి నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు.

నగరంలో..

ఖలీల్‌వాడి: నగరంలో పోలీసులు ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా, మద్యం తాగి వాహనాలు నడుపుతూ 26 మంది పట్టుబడ్డారు. వారికి ట్రాఫిక్‌ ఏసీపీ మస్తాన్‌ అలీ ఆదేశాల మేరకు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ మంగళవారం కౌన్సెలింగ్‌ నిర్వహించి, జిల్లా కోర్టులోని సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ నూర్జహాన్‌ ఎదుట హాజరు పర్చారు. జడ్జి వారిలో 22 మందికి రూ. 26 వేల జరిమానా విధించాగా నలుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ తెలిపారు. అలాగే ఓ మైనర్‌ వాహనం నడుపుతూ పట్టుబడగా, పోలీసులు వాహన యజమానిని పట్టుకొని కోర్టులో హాజరుపర్చారు. జడ్జి అతడికి రెండు రోజుల జైలుశిక్ష విధించారు.

నిబంధనలు పాటించని దుకాణ యజమానికి..

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన షేక్‌ ఖలీమ్‌ అనే రాత్రి సమయంలో నిబంధనలకు విరుద్ధంగా దుకాణం నిర్వహిస్తుండటంతో పోలీసులు పట్టుకున్నారు. అనంతరం అతడిని పోలీసులు మంగళవారం ఆర్మూర్‌ మార్నింగ్‌కోర్టు మెజిస్ట్రేట్‌ గట్టు గంగాధర్‌ ఎదుట హాజరుపర్చగా ఏడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

తప్పిపోయిన బాలుడు.. తల్లి చెంతకు చేర్చిన పోలీసులు



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలో ఓ బాలుడు ఇంటికి వెళ్లే దారి తెలియక తప్పిపోవడంతో పోలీసులు గుర్తించి, తల్లి చెంతకు చేర్చారు. వివరాలు ఇలా.. మామిడిపల్లికి చెందిన ప్రణయ్‌ అనే ఐదేళ్ల బాలుడు మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కొద్దిసేపటికి అతడు తిరిగి ఇంటికి వెళ్తుండగా దారి తెలియక జాతీయ రహదారి కూడలిలో ఏడుస్తుండగా, పోలీసులు గుర్తించారు. వెంటనే వారు బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి ఫొటోలను సోషల్‌ మీడియాలో పెట్టారు. కొద్దిసేపటికే బాలుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు తల్లిదండ్రుల చిరునామాను తెలియజేశారు. దీంతో మామిడిపల్లిలో నివాసం ఉంటున్న తల్లి శిరీషకు బాలుడిని క్షేమంగా అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్‌ తెలిపారు.

విద్యుత్‌ షాక్‌తో ఒకరి మృతి



భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్‌ గ్రామంలో ఒకరు విద్యుత్‌ షాక్‌తో మృతి చెందినట్లు భిక్కనూరు ఏఎస్సై నర్సయ్య తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మహమ్మద్‌ గౌసొద్దీన్‌ (55) మంగళవారం స్నానం చేసేందుకు తన ఇంట్లో వాటర్‌ హీటర్‌ ఆన్‌ చేయడానికి యత్నిస్తుండగా విద్యుత్‌ సరఫరా జరిగి కరెంట్‌ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ముంతాజ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్సై తెలిపారు.

నగరంలో గుర్తుతెలియని వ్యక్తి...

ఖలీల్‌వాడి: నగరంలోని వీక్లీ మార్కెట్‌ కల్లు దుకాణం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. కల్లు దుకాణం సమీపంలో ఈనె 26న ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని నిజామాబాద్‌ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించగా, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. అతడు గోధుమ రంగు షర్టు, ఆరెంజ్‌ కలర్‌ స్వెటర్‌, నీలి రంగు ప్యాంట్‌, తలకు ముస్లింలు ధరించే టోపీ ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతుడు కూలీ పని చేసుకునేలా ఉన్నాడని, అతడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. ఎవరికైనా సమాచారం తెలిసినచో వన్‌ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో గాని, 8712659714కు సమాచారం అందించాలన్నారు.

తాడ్వాయిలో వృద్ధురాలి ఆత్మహత్య



సాయవ్వ (ఫైల్‌)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మురళి తెలిపారు. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన ఎరుకట్ల సాయవ్వ(77) అనే వృద్ధురాలు గత యేడాది నుంచి అర్షమొలలు, వెన్ను నొప్పితో బాధపడుతుండేది. ఎన్ని ఆస్పత్రులలో చూపించినప్పటికీ నొప్పి నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సాయవ్వ సోమవారం సాయంత్రం కాలనీలోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. రాత్రివేళ కుటుంబ సభ్యులు సాయవ్వ కోసం గాలించగా బావిలో మృతదేహం కనబడింది. మరుసటి రోజు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

సిరికొండ మండలంలో ఒకరు..

సిరికొండ: మండలంలోని మెట్టుమర్రి తండాలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. తండాకు చెందిన కేతావత్‌ తిరుపతి(42) అనే వ్యక్తికి నీల, గోదావరి అనే ఇద్దరు భార్యలు ఉన్నారు. కొన్ని రోజుల క్రితం రెండో భార్యతో గొడవ జరగడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఇటీవల ఆమె తన భర్తపై ధర్పల్లి పోలీస్‌ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈక్రమంలో అతడు మద్యానికి బానిసై, మంగళవారం ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి మొదటి భార్యకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

బర్త్‌డే వేడుకల్లో కత్తులతో వీరంగం

- సోషల్‌ మీడియాలో వైరల్‌
- నాలుగేళ్ల క్రితం వీడియోగా పోలీసుల నిర్ధారణ!
- వైరల్‌ చేసిన వారిపై పోలీసుల ఆరా..

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఆటోనగర్‌లో రౌడీ షీటర్లు బర్త్‌డే వేడుకల్లో తల్వార్‌తో కేక్‌ కట్‌ చేయడమే కాకుండా ఊరేగింపుతో హల్‌చల్‌ చేసిన వీడియో ఒకటి సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై పోలీసులు అప్రమత్తమై, ఆరా తీస్తున్నారు. ఈ వీడియో సోమవారం నాటిదని కొందరు చెబుతుండగా, నాలుగేళ్ల క్రితం వీడియో అని పోలీసులు నిర్ధారించినట్లు తెలుస్తోంది.

వీడియోలో ఏముందంటే..

నగరంలోని ఆటోనగర్‌లో రౌడీ షీటర్‌ ఆరిఫ్‌ గ్యాంగ్‌ సభ్యుడు అప్పు తన బర్త్‌ డే సందర్భంగా బైక్‌పై తల్వార్‌ పట్టుకొని ర్యాలీగా వచ్చారు. అనంతరం కేక్‌ను తల్వార్‌తో కట్‌ చేసి తినిపించారు. ఈ వీడియోను సోషల్‌ మీడియాలో అప్‌లోడ్‌ చేసిన వారిపై పోలీసులు నిఘా పెట్టినట్లు తెలిసింది. తల్వార్‌తో హల్‌చల్‌ చేసిన వ్యక్తిపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. అప్పు కోసం పోలీసుల బృందం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. నగరంలో గతంలో జంగిల్‌ ఇబ్బు అలియాస్‌ ఇబ్రహీం ఛావూస్‌, ఆరిఫ్‌ డాన్‌ వేర్వేరుగా గ్యాంగ్‌లను నడిపించారు. ఆరిఫ్‌ డాన్‌, జంగిల్‌ ఇబ్బులు మృతిచెందినా వారి అనుచరులు ఈ గ్యాంగ్‌లను కొనసాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.



తల్వార్‌తో కేక్‌ కట్‌ చేస్తున్న దృశ్యం

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



ఎల్లారెడ్డిరూరల్‌: పట్టణంలోని న్యూ ఆబాది కాలనీకి చెందిన అర్హాన్‌ అనే బాలుడిపై కుక్కలు దాడి చేసి గాయపర్చినట్లు స్థానికులు మంగళవారం తెలిపారు. బాలుడు మంగళవారం రాత్రి ట్యూషన్‌ నుంచి వస్తుండగా కుక్కలు వెంటపడి గాయపర్చాయి. ఎల్లారెడ్డి పట్టణంలో 8 మందిని కుక్కలు దాడి చేసి గాయపర్చిన ఘటన మరవక ముందే బాలుడిపై దాడి చేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి పట్టణంలో కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తాళం వేసిన ఏడిళ్లలో చోరీ

సిరికొండ: మండలంలోని గడ్కోల్‌ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న ఏడు ఇళ్లల్లో చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలోని పలువురి ఇళ్లకు ఉన్న తాళాలు పగలగొట్టి ఉండటంతో మంగళవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గుర్తుతెలియని దుండగులు గ్రామంలోని మల్కి నరేష్‌ ఇంటి వద్ద సీసీ కెమెరా ఉండగా దానిపై వస్త్రం పడేసి, తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లోని తులం మూడు గ్రామాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. యాదుల్‌ అనే వ్యక్తి ఇంట్లో రూ.పది వేల నగదు, పదిహేను తులాల వెండి వస్తువులు, మేర గంగాదాసు ఇంట్లో రూ.4వేల నగదు ఎత్తుకెళ్లారు. మరో నాలుగిళ్ల తాళాలను ధ్వంసం చేయగా, చోరీ ఏమి జరగలేదని గ్రామస్తులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై రామకృష్ణలు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొండ చిలువను చంపిన గ్రామస్తులు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడికింది పల్లె శివారులో మంగళవారం సాయంత్రం స్థానికులు కొండ చిలువను చంపారు. కొండచిలువ గుర్తు తెలియని జంతువును మింగివేడయంతోనే చంపినట్లు గ్రామస్తులు తెలిపారు. కొండ చిలువ సమీపంలోని గుట్టల పైనుంచి వచ్చిందా, పెద్దవాగు శివారులో నుంచి వచ్చిందో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండ చిలువ సుమారు 8 అడుగులపైన పొడవు ఉంటుందని వారు తెలిపారు.